క్లుప్తంగా

విద్యాదాత కేవీరత్నం



ఇంజినీరింగ్ కళాశాలలో రత్నంకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఆత్మకూరు: రత్నం విద్యా సంస్థల వ్యవస్థాపకుడు, చైర్మన్ కేవీ రత్నం వేలాది మంది విద్యార్థులను డాక్టర్లుగా, ఇంజినీర్లుగా తీర్చిదిద్దిన మహోన్నత విద్యాదాత అని పలువురు వక్తలు అన్నారు. డాక్టర్ కేవీ రత్నం బుధవారం అకాల మరణం చెందడం విద్యా రంగానికి తీరని లోటని పలువురు సంతాపం తెలియజేశారు. ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. రత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పలు డిపార్ట్‌మెంట్ హెడ్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులపై అవగాహన సదస్సు

కలిగిరి: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో వృత్తివిద్యా కోర్సులపై ప్రిన్సిపల్ కే సుప్రియ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తమ పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి బ్యూటీషియన్, వెల్‌నెస్ నైపుణ్యాలను బోధిస్తున్నామన్నారు. విద్యార్థినులు వృత్తి విద్యాకోర్సులపై దృష్టి సారించి తమ భవిష్యత్‌ను రూపొందించుకోవాలన్నారు. కలిగిరిలోని హసన బ్యూటీ పార్లర్‌ను సందర్శించారు. బ్యూటీ పార్లర్ నిర్వాహకురాలు హసన విద్యార్థినులకు ఈ కోర్సుపై అవగాహన కల్పించారు.

రేపు బ్రాహ్మణక్రాకలో విజయ సంకల్పయాత్ర

జలదంకి: మండలం బ్రాహ్మణక్రాకలో శుక్రవారం ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నిర్వహించే విజయ సంకల్ప యాత్రకు నెల్లూరు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు హాజరవుతారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవెల్లి మాల కొండారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జలదంకి మండలం జమ్మలపాళెం నుంచి భారీ బైక్ ర్యాలీతో ప్రారంభమై బ్రాహ్మణక్రాకకు చేరుకుంటుందని తెలిపారు. బ్రాహ్మణక్రాకలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పోస్టల్ బ్యాలెట్లు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఏఆర్వో నెహ్రూబాబు


ఉదయగిరి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు నియమించిన ప్రభుత్వ ఉద్యోగ సిబ్బంది నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేయనున్న ఫెసిలిటీ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్లు వినియోగించుకునేలా బీఎల్వోలు చూడాలని ఏఆర్ఓ నెహ్రూబాబు తెలిపారు. ఆయన బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగా కాకుండా ఫెసిలిటీ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వేయాలన్నారు. ఎన్నికల విధులకు నియమించిన సిబ్బంది ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఈఆర్డీ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఏర్పాటు నిలిపివేయండి

ఆత్మకూరు: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం సమీపంలో ఇళ్ల మధ్య ఓ ఇంటి యజమాని మేడపైన ఎలాంటి అనుమతులు లేకుండా సెల్ టవర్ నిర్మాణం చేస్తున్నారని, దీన్ని నిలపాలని స్థానికులు మహిళలతో కలిసి మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లాకు బుధవారం వినతి పత్రం అందజేశారు. స్థానికుల అభిప్రాయాలు తీసుకోకుండా ఈ టవర్ నిర్మాణం చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

కోడ్‌ను కచ్చితంగా పాటించాలి

- ఆర్డీఓ కె మధులత



ఆత్మకూరు: కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశించిన మేరకు ఎన్నికల ప్రచారంలో రాజకీయ పార్టీల నాయకుల వెంట ప్రభుత్వ ఉద్యోగులు పర్యటిస్తే కోడ్ ఉల్లంఘించినట్లేనని, వారిపై చర్యలు తప్ప వని ఆత్మకూరు ఆర్డీఓ, ఎన్నికల ఆర్ఓ కె మధులత అన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని ఆర్డీఓ చాంబర్‌లో ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఏఎస్‌పేట, చేజర్ల, సంగం మండలాల్లో రెండు రోజుల క్రితం జరిగిన ఎన్నికల ప్ర చారంలో ముగ్గురు వలంటీర్లు, ఓ వీఆర్ఓ, ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు తెలియడంతో వారిని కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 66 కేంద్రాలను గతంలో జరిగిన ఎన్నికల్లో ఘటనలను దృష్టిలో ఉంచుకుని వాటిని సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించినట్లు తెలిపారు. చేజర్ల మండలంలోని పాతపాడు, గొల్లపల్లి, ఓబులాయపల్లి, కండ్రిక పోలింగ్ కేంద్రాలను సౌకర్యాలు ఉన్న ఇతర భవనాల్లోకి మార్చినట్లు వివరించారు.

ప్రతి అడుగు ప్రజాసంక్షేమం కోసమే

- ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటు వేయాలి
- సంక్షేమాభివృద్ధి కొనసాగేందుకు జగనన్నను ఆశీర్వదించాలి
- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



విజయీభవయాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సోమశిల: జగనన్న ప్రభుత్వంలో ప్రతి అడుగు ప్రజాసంక్షేమం కోసం ముందుకు సాగిందని, ఇలాంటి సంక్షేమ పాలన మళ్లీ కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ప్రజలందరూ ఆశీర్వదించాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కోరారు. బుధవారం అనంతసాగరం మండలం కె.వడ్డీపాళెం, కొత్తపల్లి, కాకూరువారిపల్లి, వెంగమనాయుడుపల్లి, కచిరిదేవరాయపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి విజయీభవ యాత్ర నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మేకపాటికి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మేకపాటి ప్రజలతో మమేకమవుతూ మాట్లాడారు. సంక్షేమాభివృద్ధిలో రాష్ట్ర ప్రజలకు అన్ని విధాలుగా మేలు చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి గడపలో ఆరోగ్య భరోసాను అందించారని, ప్రతి ఒక్కరూ ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకోవాలనే సమున్నత లక్ష్యంతో ముందుకు సాగారన్నారు. రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలన్నింటిని మిగిలిన రాష్ట్రాల వారు అమలు చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారని, అయితే మన రాష్ట్రంలోని ప్రతిపక్షాలు మాత్రం దుష్ప్రచారాలు చేస్తున్నాయన్నారు. ఇప్పుడు ఎన్నికలు రావడంతో అవే పథకాలను పేరు మార్చి ప్రజల వద్దకు తెస్తున్నారన్నారు.

టీడీపీకి మేనిఫెస్టో అమలు చేసిన చరిత్ర ఉందా?

టీడీపీకి మేనిఫెస్టోను అమలు చేసిన చరిత్ర ఎప్పుడూ లేదని, అధికారం కోసం చెప్పడం ఆనాక మోసం చేయడం టీడీపీ నైజమని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి దుయ్యబట్టారు. సంక్షేమమే కాదు.. అభివృద్ధి చేసిన చరిత్ర లేదన్నారు. ప్రజలంతా గమనించాలని కోరారు. ఐదేళ్లలో జగనన్న సంక్షేమాన్ని అందుకున్న ప్రతి ఒక్కరూ ప్రజలకు చేసిన మేలు, సంక్షేమాన్ని అందరికి వివరించాల్సిన బాధ్యత తీసుకోవాలని, మళ్లీ మనందరి సంక్షేమ ప్రభుత్వం వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ ఐదేళ్లలో ఈ ఐదు గ్రామాల్లోనే డీబీటీ, నాన్‌డీబీటీ పథకాల ద్వారా 4,456 మంది లబ్ధిదారులకు రూ.19.87 కోట్లు అందజేశామని వివరించారు. విద్యాభివృద్ధికి 47 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చామని, గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా అభివృద్ధి పనులను చేశామని, రెవెన్యూ సంస్కరణలు, కలెక్టర్‌తో జరిపిన ప్రత్యేక సమీక్షలతో 676 మంది రైతులకు సంబంధించి 565 ఎకరాల్లో భూ సమస్యలు పరిష్కారం జరిగిందని వివరించారు. గత ప్రభుత్వాల పాలనలో నియోజకవర్గంలో ఇంతటి అభివృద్ధి, సంక్షేమం చేశామని ప్రజలను ఓటు అడిగే దమ్ము, ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదిస్తే జగనన్న సారథ్యంలో మీ అందరూ మెచ్చేలా అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, జేసీఎస్ కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, బత్రెడ్డి జనార్దన్‌రెడ్డి, సూరా నరసింహారెడ్డి, చిలకా కృష్ణారెడ్డి, కాకూరు నారసింహారెడ్డి, సర్పంచ్ చిచ్చు ఓబులమ్మ, సూరా చిన్నారెడ్డి, గుత్తి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

నవ్వి పోదురుగాక.. నాకేటి సిగ్గు!

- టీడీపీలో పరాకాష్టకు చేరిన ఉత్తుత్తి చేర్పులు
- కండువా కప్పుకునేందుకు డబ్బుల ఎర
- నియోజకవర్గేతరులకు కండువా కప్పుతున్న కావ్య



ఉదయగిరి నియోజకవర్గ వాసి అమరజీవిరెడ్డికి టీడీపీ కండువా వేస్తున్న కావ్య కృష్ణారెడ్డి

కావలి: టీడీపీ.. అంటే.. తెలుగు డ్రామా పార్టీ అని ఊరకనే అనడం లేదు. క్షేత్రస్థాయిలో బలహీనంగా ఉన్న టీడీపీకి కావలి నియోజకవర్గ అభ్యర్థిగా బరిలోకి దిగిన కావ్య కృష్ణారెడ్డి అలియాస్ దగుమాటి కృష్ణారెడ్డి ఉత్తుత్తి చేర్పుల కార్యక్రమానికి తెరతీశారు. రోజుకొక ప్రాంతానికి వెళ్లి.. పార్టీ కండువా వేసుకుంటే.. డబ్బులిస్తామంటూ ఎరవేస్తున్నాడు. ఆఖరికి స్థానికేతరులకు పార్టీ కండువా వేసి 'వైసీపీకి షాక్' అంటూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నాడు. మైనింగ్ మాఫియాగా రూ.కోట్లకు పడగలెత్తిన కావ్య ఇచ్చే డబ్బులు, మద్యం కోసం కొందరు ఆ కాసేపు టీడీపీ కండువా వేసుకుంటున్న పరిస్థితి నియోజకవర్గంలో కనిపిస్తోంది. ఆయన అటు పోగానే కండువా తీసి పక్కన పడేస్తున్నట్లు ఆ పార్టీ నేతలే బాహాటంగా చెప్పుకుంటున్నారు. ఇటీవల కావలి పట్టణంతో పాటు మండలంలో కొందరు టీడీపీలో చేరినట్లు సోషల్ మీడియాలో వార్తలు వచ్చిన కాసేపటికే సదరు వ్యక్తులు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని కలిసి తామంతా వైఎస్సార్‌సీపీలోనే ఉన్నామని, మాట్లాడాలని పిలిచి కండువాలు వేశారని, వదిలించుకుని పోలేక మొహమాటం కోసం కండువాలు వేయించుకున్నామని వాపోవడం గమనార్హం. ఇలా కావ్య పైత్యం పరాకాష్టకు చేరింది. జనాల ఊసుల్లో కూడా లేని టీడీపీ ఉనికి కాపాడుకునేందుకు నెల రోజుల నుంచి ఉత్తుత్తి చేరికలతో హైడ్రామా నడిపిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా అసలు నియోజక వర్గానికి సంబంధం లేని వ్యక్తిని కావలికి తీసుకువచ్చి కండువా కప్పి సోషల్ మీడియాలో 'వైసీపీకి షాక్' అంటూ పోస్టులు పెట్టడంతో జనాలు నవ్వుకుంటున్నారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి తమ్ముడు అమరజీవిరెడ్డి. కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారంటూ బుధవారం సోషల్ మీడియాలో ఊదరగొట్టారు. వాస్తవానికి మెట్టుకూరు చిరంజీవిరెడ్డిది ఉదయగిరి నియోజకవర్గం కలిగిరి మండలంలోని అనంతపురం గ్రామం. ఆయన సతీమణి కలిగిరి ఎంపీపీ పదవిలో ఉన్నారు. ఆయన తమ్ముడు అమరజీవిరెడ్డి రాజకీయంగా క్రియాశీలకంగా ఉండే వ్యక్తి కూడా కాదు. అసలు ఆయనకు, కావలికి ఎటువంటి సంబంధం కూడా లేదు. రాజకీయంగా పబ్బం గడుపుకునేందుకు, ప్రజలను మాయ చేసేందుకు అమరజీవిరెడ్డి వంటి వ్యక్తులను బయట నుంచి తీసుకువచ్చి కండువాలు కప్పి ప్రచారం చేసుకుంటున్నారు. వీరి సర్కస్ వేషాలు చూసి జనాలు నవ్వుకుంటున్నా, సోషల్ మీడియాలో కామెంట్లతో కామెడీ చేస్తున్నా.. వీరి తీరు మాత్రం మారడం లేదు.

శాస్త్రోక్తంగా తిరుమంజనం

- సుగంధ ద్రవ్యాలతో పరిమళించిన బిలకూట క్షేత్రం
- వైభవంగా ధ్వజారోహణ
- వాహన సేవలకు సిద్ధమైన ప్రసన్నుడు



బిట్రగుంట: భక్తిశ్రద్ధలతో మెట్లపూజ నిర్వహిస్తున్న మహిళలు

బిట్రగుంట: ప్రసిద్ధ కొండబిట్రగుంట బిలకూటక్షేత్రం బ్రహ్మోత్సవాల్లో భాగంగా వాహన సేవలకు ప్రారంభ ఘట్టమైన తిరుమంజన సేవను బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వీపూరి సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో అర్చక బృందం వేకువనే తిరుమంజన సేవ ప్రారంభించారు. వైఖానస ఆగమశాస్త్రానుసారం పాలు, పెరుగు, నీరు, తేనె, కొబ్బరినీళ్లు, సుగంధ ద్రవ్యాలతో ప్రసన్న వేంకటేశ్వర స్వామిని, ఉత్సవరులను అభిషేకించారు. అనంతరం అంతరాలయంతో పాటు ఆలయ ప్రాంగణాన్ని శుద్ధి చేసి ఉత్సవాలకు సిద్ధం చేశారు. ఒక వైపు తిరుమంజన సేవలో వినియోగించిన సుగంధ ద్రవ్యాలు, మరో వైపు పసుపు, కుంకుమలు కలిసిన నీళ్లతో ఆలయ ప్రాంగణమంతా సుగంధ పరిమళాలు వ్యాపించాయి. తిరుమంజన సేవ అనంతరం అలంకార మండపంలో ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. లక్ష్మీవల్లభునికి ప్రీతిపాత్రమైన తులసి మాలలతో శ్రీవారిని, ఉభయ నాంచారులను అలంకరించి, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను సమర్పించారు. హారతి అనంతరం సహస్రధారతో మరో మారు మహాశుద్ధి కార్యక్రమంగా అభిషేకించారు. సర్వాభరణ అలంకారంలో స్వామికి మంగళహారతిని సమర్పించి అంతరాలయ దర్శనాన్ని కొనసాగించారు.

భక్తిశ్రద్ధలతో మెట్లపూజ

బ్రహ్మోత్సవాల్లో స్వామి వారిని సేవించి తరించేందుకు వచ్చిన మహిళలు భక్తి శ్రద్ధలతో మెట్ల పూజ నిర్వహించారు. దీర్ఘసుమంగళిగా వర్ధిల్లాలని, భర్త, పిల్లలు, కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ మెట్ల మార్గాన్ని పసుపు కుంకుమలతో పూజించి హారతులిచ్చారు. యువతులు కూడా అధిక సంఖ్యలో మెట్ల పూజలో పాల్గొని పూజలు నిర్వహించారు. సంతానలేమితో బాధపడుతూ కొడిముద్దల స్వీకరణకు వచ్చిన మహిళలు అధిక సంఖ్యలో మెట్లపూజ, గోపూజల్లో పాల్గొన్నారు.

ధ్వజారోహణతో ప్రారంభమైన ఉత్సవాలు

బిలకూట క్షేత్రంలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు గరుడ ధ్వజ సంకేతంతో బుధవారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. వైఖానస ఆగమోక్తంగా వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ భక్తులు గోవింద నామస్మరణల చేస్తుండగా ప్రధానార్చకులు వీపూరి సత్యనారాయణాచార్యులు సహచర అర్చక బృందంతో కలిసి శాస్త్రోక్తంగా ధ్వజారోహణ చేశారు. ఐదు రోజుల పాటు జరిగే స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వాహన సేవలకు సర్వదేవతా పరివారాన్ని, అష్టదిక్పాలకులను ఆహ్వానిస్తూ ధ్వజస్తంభం వద్ద గరుడధ్వజాన్ని ఆరోహణ చేశారు.

ఉత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రసన్నుడికి గురువారం హనుమంత సేవ జరుగుతుంది. రామావతారంలో ప్రసన్నుడి దుష్టశిక్షణార్థం హనుమంతుడిపై ఊరేగుతారని ఆలయ పాలక మండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో భక్తులకు నాణ్యమైన సేవలు

- శుక్ర, శని, ఆదివారాల్లో 30 ప్రత్యేక బస్సులు
- కావలి డిపో మేనేజర్ శ్రీనివాసులు

కావలి: కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు వెళ్లే భక్తులకు నాణ్యమైన సేవలు అందించాలని ఆర్టీసీ కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు చెప్పారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో సిబ్బంది, కార్మిక నాయకులకు విడివిడిగా సమావేశాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఆర్టీసీ పరంగా అందించాల్సిన సేవలు, ఏర్పాట్లపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ శుక్ర, శని, ఆదివారాల్లో బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో 30 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కావలి, ముంగమూరు తోటలు, అల్లూరు, కొండబిట్రగుంట రైల్వేగేట్ వద్ద ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు చేసి, వలంటీర్లు, మెకానికల్ సిబ్బందితో పాటు ఆర్టీసీ సెక్యూరిటీ కానిస్టేబుళ్లు ప్రయాణికులు, భక్తులకు సహకారం అందించాలన్నారు. అక్కడ భక్తులకు తాగునీరు, కుర్చీలు ఏర్పాటు చేయాలని వివరించారు. ఈ మూడు రోజులు 24 గంటలు బస్సులు నడపాలని, ఎలాంటి అసౌకర్యం కలుగకుండా వ్యవహరించాలని, భక్తులు రోడ్డు దాటే సమయంలో వలంటీర్లు ఎలాంటి ప్రమాదం జరుగకుండా సహకరించాలని సూచించారు. అక్రమ వాహనాల్లో ప్రయాణాన్ని నివారించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కేవీఆర్ బాబు, అసిస్టెంట్ ఇంజినీర్ (మెకానికల్) ఎస్కే ఖాజామొహిద్దీన్, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి.రవిప్రకాష్, సూపర్‌వైజర్, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ



పోలేరమ్మ గుడి



హుండీని తెరిచి ఉన్న దృశ్యం

వరికుంటపాడు : మండలంలోని తూర్పుబోయమడుగుల గ్రామ సెంటర్‌లో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు.. రోజూలాగే ఆలయ పూజారి మంగళవారం సాయంత్రం పూజా కార్యక్రమాలు ముగించుకుని తాళాలు వేసుకుని ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ప్రధాన ద్వారం తలుపు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. హుండీలోని నగదు చోరీ చేశారు. బుధవారం ఉదయం గుడికి వచ్చిన పూజారి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి వివరాలు నమోదు చేసుకున్నారు.

పోలేరమ్మ గుడిలో..

మర్రిపాడు: మండలంలోని నందవరం పోలేరమ్మ గుడిలో చోరీ జరిగిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి గర్భగుడిలో ఉన్న హుండీని ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని మంగళవారం రాత్రి గమనించిన గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై విశ్వనాథరెడ్డి గుడికి చేరుకుని పరిశీలించారు. బుధవారం వెతకగా ఆలయానికి సుమారు అర కిలోమీటర్ దూరంలో హుండీని గుర్తించారు. అందులోని కానుకలు లేవు. బుధవారం నెల్లూరు నుంచి క్లూస్ టీమ్‌ను పిలిపించి వేలిముద్రలను సేకరించారు. దొంగలను త్వరగా పట్టుకుంటామని ఎస్సై తెలిపారు. గుడిలో సీసీ కెమెరాలున్నాయి. దీంతో విద్యుత్ సరఫరా ఆపేసి చోరీ చేసినట్లు గుర్తించారు.

ప్రజా మద్దతు విక్రమన్నకే

- మాజీ కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి



ప్రచార కరపత్రాలను అందజేస్తున్న మాజీ కన్వీనర్ రఘునాథరెడ్డి

సంగం: ఆత్మకూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ మద్దతుతో అనేక పదవులు పొంది, స్వప్రయోజనాల కోసం పార్టీ మారుతూ వెన్నుపోటు పొడిచామని సంబరపడుతున్నారని, రానున్న 2024 ఎన్నికల్లో వారందరికీ ప్రజలే బుద్ధి చెబుతారని సంగం మండల మాజీ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి అన్నారు. బుధవారం సంగంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి మద్దతుగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల వద్దకు వెళ్లి కరపత్రాలను అందజేసి, విక్రమ్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ప్రభుత్వ సహకారానికి తోడు ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయవచ్చునని 'ఆత్మకూరు డెవలప్ మెంట్ ఫోరం' ఏర్పాటు చేసి తద్వారా మరింతగా అభివృద్ధి చేస్తున్నారని, ఇలాంటి ఎమ్మెల్యే వెంట నడిచేందుకు నియోజకవర్గంలోని ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. గతంలో దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి రెండోసారి గెలిచిన తర్వాత తమ అవసరాలు తీర్చుకునేందుకు ఇతర పార్టీల నుంచి వచ్చి వైఎస్సార్‌సీపీలో చేరిన వీరందరూ ఆయన ఆశీర్వాదంతో ఎన్నో పదవులు అనుభవించారన్నారు. ఆయన హఠాన్మరణంతో ఆయన స్థానంలో వచ్చిన విక్రమ్‌రెడ్డి వద్ద ఎన్నో మాటలు చెప్పారని, ఇప్పుడు పార్టీ మారుతున్నారని, ఇలాంటి వారిని సంగం ప్రజలెన్నటికి క్షమించరన్నారు. రానున్న ఎన్నికల్లో ఆత్మకూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మరోసారి ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలుపొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నేత అనుమాలశెట్టి రామారావు, సంగమేశ్వరాలయ చైర్మన్ రవీంద్రబాబు, యువజన విభాగం అధ్యక్షుడు ఊటుకూరు జనార్దన్‌రెడ్డి, జహంగీర్, వేణు, కరుణాకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి



పని ప్రదేశంలో నీడ సౌకర్యం కల్పించిన ఏపీఓ

ఉదయగిరి: మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు హాజరవుతున్న కూలీలకు క్షేత్ర సహాయకులు తగిన సౌకర్యాలు కల్పించాలని ఏపీఓ బి.శ్రీనివాసులు తెలిపారు. ఆయన బుధవారం మండలంలోని నేలటూరు, శకునాలపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను, మస్టర్లను పరిశీలించి కూలీలకు సిబ్బందికి తగు సూచనలందించారు. ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా పని ప్రదేశాల్లో నీడ సౌకర్యం, తాగునీటి వసతి కల్పించాలన్నారు. పనులకు వచ్చే కూలీలకు కొలతలు కేటాయించి పనులు చేయించాలన్నారు. ఉదయం ఆరు గంటలకు కూలీలు పనులకు వచ్చేలా చూడాలన్నారు.

ఉత్తరకాలువ నీటి విడుదల క్రమబద్ధీకరణ



ఉత్తర కాలువ 50వ కి.మీ. వద్ద రైతులతో మాట్లాడుతున్న అధికారులు

ఆత్మకూరురూరల్: సోమశిల జలాశయం నుంచి ఉత్తర కాలువ ద్వారా విడుదల చేస్తున్న సాగునీటిని బుధవారం నుంచి క్రమబద్ధీకరించామని సోమశిల ప్రాజెక్ట్ 4వ డివిజన్ ఈఈ రమణారెడ్డి అన్నారు. ఉత్తర కాలువ 50వ కి.మీ. వద్ద ఆత్మకూరు చెరువుకు సాగునీందించే కాలువ ప్రవాహాన్ని ప్రాజెక్ట్ 4వ డివిజన్ డీఈ మురళీకృష్ణారెడ్డి, ఏఈలు పరమేశ్వరరెడ్డి, కొండారెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జలాశయంలో నీటి నిల్వ పరిమాణం గణనీయంగా తగ్గిపోయిందన్నారు. ఇకపై సోమశిల ఉత్తర కాలువ 50 కి.మీ. వద్ద ఉండే రెగ్యులేటర్ వరకు వారానికి మూడు రోజులు మాత్రమే నీరు విడుదల చేస్తామన్నారు. వారాబందీ పద్ధతిలో నీరు విడుదల చేసి ఆత్మకూరు కాలువ వరకు మాత్రమే నీటి విడుదల చేస్తామన్నారు. రైతులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని సాగు నీటిని జాగ్రత్తగా పొదుపుగా వాడుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మెట్ట ప్రాంతాల అభ్యున్నతి మా బాధ్యత



- మాజీ ఎంపీ మేకపాటి

మర్రిపాడు: ఆత్మకూరు, ఉదయగిరి మెట్టప్రాంత నియోజకవర్గాల అభ్యున్నతి మా బాధ్యత అని నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సింగనపల్లిలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మేకపాటి ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో అందుతున్న సంక్షేమ పథకాల గురించి, ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమాన్ని గ్రామాల్లో అభివృద్ధిని కళ్లారా చూపారన్నారు. రానున్న రోజుల్లో సోమశిల హైలెవల్ కెనాల్ పనులను పూర్తి చేసి రైతులకు పూర్తి స్థాయిలో సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా సుబ్బిరెడ్డి, రేవూరు వేణుగోపాల్‌రెడ్డి, సోమల మాధవరెడ్డి, కాశీరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కృష్ణప్రసాద్‌రెడ్డి, నారపరెడ్డి సుబ్బారెడ్డి, రామ్మోహన్, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కోడ్ అమలు పరిశీలన

వరికుంటపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో అమలవుతున్న కోడ్‌ను బుధవారం పర్యవేక్షణాధికారి వేణుగోపాల్, ఎంపీడీఓ వెంకటకృష్ణకుమారి పరిశీలించారు. మండలంలోని విరువూరు, పెద్దిరెడ్డిపల్లి గ్రామ సచివాలయాలను సందర్శించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మోడల్ కోడ్‌ను పక్కాగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది వలంటీర్లు, రాజకీయ సమావేశాల్లో, కార్యక్రమాల్లో పాల్గొనరాదన్నారు. ఉద్యోగులు వారి విధులు బాధ్యతగా నిర్వర్తించాలన్నారు.